


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 23.02.2026 | సంపుటి : 3 | సంచిక :22 | పేజీలు : 9 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Monday | 23.02.2026 | volume : 3 | Issue : 22 | Pages : 9 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## లొంగిపోయిన దేవ్‌జీ

**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్‌ఐబీ పోలీసుల ఎదుట లొంగుబాటు**

**ఇంకా ధ్రువీకరించని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు..**

**కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లక్ష్యం ఇక నెరవేరినట్లేనని చర్చ**

**వీరితో పాటు 16 మంది లొంగుబాటు**



**మావోయిస్టు పార్టీ అగ్రనేత, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎట్టకేలకు అజ్ఞాతం వీడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్‌ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారని విశ్వసనీయ సమాచారం.**

భద్రాద్రి కొత్తగూడెం: ఆయనతోపాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ్‌శర్మ ఆదివారం రాయ్‌పూర్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అయితే ఈ వార్తలను తెలంగాణ పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, దేవ్‌జీ లొంగుబాటు వార్తల నేపథ్యంలో కేంద్రం సాగిస్తున్న ఆపరేషన్ కగార్-2 లక్ష్యం

-మిగతా 2 లో..



## రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

## కాళేశ్వరాన్ని వదిలేయం వాడుకలోకి తెస్తాం

**భూసేకరణే అసలు సమస్య..**

**ఫలితంగా అంచనాలు పెరిగాయి**

**పది సంవత్సరాలు పాలించిన వారు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు**

**ఎన్ని ఇబ్బందులెదురైనా భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్**

**దేవాదుల కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు ఇస్తామని వెల్లడి**

**దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు**

**తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం మహా అద్భుతం అన్నారని.. తాము వచ్చినప్పటి నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదని చెప్పారు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయకుండా ఉపయోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు.**

వరంగల్: ఒక్క కాళేశ్వరం పైనే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం మిగతా ప్రాజెక్టులను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్న మాట వాస్తవమే అయినా, వేల కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టును అలాగే వదిలేయలేమని చెప్పారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా నిపుణుల కమిటీ సూచనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వాడుకలోకి తెస్తామని ప్రకటించారు. ఆదివారం ఉమ్మడి వరంగల్‌లో పర్యటించిన రేవంత్‌రెడ్డి.. మంత్రులు

-మిగతా 2 లో..



## కాంగ్రెస్ నగ్న రాజకీయాలు

**ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?**

**ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో ప్రధాని మోదీ ధ్వజం**

**దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు.**

మీరట్, ఫిబ్రవరి 22: ఆదివారం ఆయన యూపీలోని మీరట్‌లో నమో భారత్ రైలును, విస్తరించిన మెట్రో రైలును, రూ.12,930 కోట్లతో పూర్తిచేసిన పలు

-మిగతా 2 లో..



## రాంచందర్‌రావు అరెస్టు

**ఇంటి వద్దే ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు..**

**ఈటల, ఏలేటి గృహ నిర్బంధం**

**కాంగ్రెస్, మజ్లిస్‌పై రాంచందర్‌రావు ఆగ్రహం**

**అసద్ చెప్పుచేతల్లో సర్కారు ఉందని విమర్శ**

**కామారెడ్డిలో కొనసాగుతున్న ఉద్రిక్తత**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 : కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం.. బాన్సువాడలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘటనలు చెలరేగిన నేపథ్యంలో ఆదివారం చలో కామారెడ్డి, బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆయా

-మిగతా 2 లో..



## ఆందోళన వద్దు..

## అందరికి అక్రిడిటేషన్లు

**యూనియన్ల సూచించిన పేర్లతోనే జిల్లా అక్రిడేషన్ కమిటీలు**

**వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తాం..**

**అందరికి అక్రిడిటేషన్లు ఇస్తాం**

**పాత అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు**

**టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ బృందానికి మంత్రి పొంగులేటి హామీ**

ఖమ్మం : జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదన మేరకే జిల్లా అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ , వెబ్ సైట్, కేబుల్ చానల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటి కి టియుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ్ నారాయణ సారధ్యంలో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల

-మిగతా 2 లో..

## రైతు భరోసా ఏదీ?

**ఎన్నికలు ముగిసిన రైతుల ఖాతాల్లో జమ కాని నగదు**

**స్పష్టమైన ప్రకటన లేకపోవడం రైతుల్లో అసంతృప్తి**

**అధిక వడ్డీతో అప్పులు తీసుకుని సాగు కొనసాగించాల్సిన పరిస్థితి!**

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, రైతులకు సాగు ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించేందుకు రూపొందించారు. సాధారణంగా వానాకాలం, యాసంగి సీజన్‌లకు అనుగుణంగా సాయం విడుదల చేయాలి. కానీ అమలులో ఉన్న సమస్యలు, ఆలస్యాలు, స్పష్టతలేమి కారణంగా ఈ పథకం రైతులకు నిజంగా భరోసా ఇస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.**




హైదరాబాద్: గత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా సాయం పూర్తిగా విడుదల కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేఏడాది వానాకాలం సీజన్‌లో రైతు భరోసాను నాలుగు ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. పెద్ద భూస్వాములు మాత్రమే కాదు, 5--6 ఎకరాల చిన్న, మధ్య తరహా రైతులు కూడా నష్టపోయారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసి వెంటనే రైతు భరోసా డబ్బులు జమ అవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే ఎన్నికలు పూర్తయ్యాక కూడా ప్రభుత్వం నుంచి స్పష్టమైన

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 115 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 206 (కిలో) |
| స్కిన్ లెస్ | 234 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## జమ్మూలో ఎన్‌కౌంటర్

**ముగ్గురు టెర్రరిస్టులు హతం**

జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని కిష్వార్తా జిల్లాలోని మారుమూల ప్రాంతంలో భద్రతా బలగాలకు తీవ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. సైన్యం జరిపిన కౌంటర్ టెర్రర్ ఆపరేషన్‌లో ముగ్గుర ఉగ్రవాదులు హతమయి నట్లు తెలుస్తోంది. జమ్మూ లోని. మృతిచెందిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని

-మిగతా 2 లో..



## సీఎం ప్రతి అడుగు వెనుక భూకబ్జాలే..

**మూసీ శుద్ధి పేరుతో పేదల ఇళ్లు కూలుస్తారా?:**

**మూసీ బాధితులకు అండగా ఉంటాం..**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసే ప్రతి అడుగు వెనుక భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్

-మిగతా 2 లో..





## బాల్క సుమన్ ఇంట్లో సోదాలు

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. బాల్క సుమన్ ఇంటి ముందు మాజీ కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ మాట్లాడుకుంటుండగా.. ఆర్కేపీ

-మిగతా 2 లో..



## కాంగ్రెస్ నగ్న రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన.. ఆ పురాతన పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి, పతనానికి నిదర్శనం. సొంత దేశాన్నే అప్రతిష్ఠ పాల్జేస్తోంది. కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు. నాకు సమాధి తవ్వాలనుకుంటున్నారు. చివరకు నా తల్లిని అవమానించేందుకూ వెనుకాడడం లేదు. కానీ, ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని వారు గుర్తుంచుకోవలసింది. ఇది జాతీయ కార్యక్రమం. కాంగ్రెస్ సభ్యత మరచి వ్యవహరించింది. అన్ని హద్దులూ దాటేసింది. వారి ప్రవర్తనను దేశం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు సిగ్గుపడాల్సింది పోయి.. దేశాన్ని అవమానించినవారిని హీరోలుగా చిత్రిస్తోంది' అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును ఖండించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అవి జాతీయాభిమానం, సత్యం వైపు నిలిచాయని కొనియాడారు. ఒక్క కాంగ్రెస్ నేతలు మాత్రమే ఇలాంటి నిరసనకు దిగారని.. దాని మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలకు ప్రమేయం లేదని చెప్పారు. ఈ సందర్భంగా మీడియాకు ఓ సూచన చేశారు. 'ప్రతిపక్షంపై మోదీ విరుచుకుపడ్డారు' వంటి శీర్షికలు పెట్టొద్దని.. తద్వారా కాంగటస్రను కాపాడే ప్రయత్నం చేయొద్దని కోరారు. హద్దూ అదుపూలేని, ఉన్మాద కాంగ్రెస్ నేతలు దేశాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని మోదీ ధ్వజమెత్తారు. 'ఆ పార్టీ పార్లమెంటును స్తంభింపజేస్తోంది. ఈ నెల మొదటివారంలో లోక్‌సభలో ప్రధాని కుర్చీని కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు. ఆ పార్టీ నేతలు సభలో మాట్లాడరు.. మిత్రపక్షాలనూ మాట్లాడనివ్వడం లేదు. పార్లమెంటును అడ్డుకోవడం వల్ల కాంగ్రెస్ మిత్రులే ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. కాంగ్రెస్ ఈ దేశానికి భారంగా మారింది. ప్రధాని కుర్చీలో కూర్చోవాలనుకుంటే మొదట ప్రజల హృదయాలను గెలవాలి. ఆ కుర్చీని ఆక్రమించుకోవడానికి మహిళా ఎంపీలను పంపితే మీరు ప్రధాని కాలేరు' అని మోదీ ఎద్దేవా చేశారు.

## రాంచందర్‌రావు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాలకు వెళ్లేందుకు యత్నించిన పలువురు పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మరి కొందరిని గృహ నిర్బంధం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డితో పాటు బాన్సువాడలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి బొల్లారం ఠాణాకు తరలించారు. దీంతో ఆయన్ను విడుదల చేయాలని బీజేపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. మరోవైపు, కామారెడ్డికి బయలుదేరిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్ పోలీసుల కన్నుగప్పి కామారెడ్డికి రావడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ వెళుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను మార్గమధ్యలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొల్లారం పోలీసు స్టేషన్‌లో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చెప్పుచేతల్లో సర్కారు కొనసాగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం చేతిలో బందీగా మారిందని విమర్శించారు. పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేయడం, ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాన్సువాడలో హిందువుల ఇళ్లపై జరిగిన రాళ్ల దాడి అత్యంత అమానుషమని అన్నారు. బాన్సువాడలో ఒక్క ఎంఐఎం కార్యకర్తను కూడా అరెస్టు చేయని పోలీసులు80మంది బీజేపీ, హిందూ సంఘాల కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. హిందూ సంఘాలపై, తమ పార్టీ కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను సహించబోమని తేల్చిచెప్పారు. తాను బాన్సువాడ వెళ్లి తీరతానని, బాధితులను పరామర్శిస్తానని చెప్పారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పనిచేయాలి తప్ప, కాంగ్రెస్ నేతల చేతుల్లో తోలుబొమ్మలా వ్యవహరించవద్దని సూచించారు. కాగా, రాంచందర్‌రావు అరెస్టును నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు తార్నాక చౌరాస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

### అక్రమాలను ప్రశ్నిస్తే దాడులా?: సంజయ్

కాంగ్రెస్ అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందా..?అని నిలదీశారు. కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే అని స్పష్టం చేశారు. బాన్సువాడలో రాళ్లదాడికి పాల్పడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. బాన్సువాడ బయలుదేరిన రాంచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. పార్టీ హైకమాండ్‌కు కప్పం చెల్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అప్పు మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించి, వారిచ్చే కమీషన్లను హైకమాండ్‌కు పంపించేందుకు మంత్రులు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనతో పాటు పార్టీ ముఖ్య నాయకులను రెండు రోజులుగా హౌస్ అరెస్టు చేయడం రేవంత్ సర్కార్ నిర్బంధకాండకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ఆరంభమైందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రేవంత్ సీఎం అయ్యాక హిందువులపై దాడులు పెరిగిపోయాయని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిర్బంధించడం, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. బాన్సువాడ ఘటనపై డీజీపీ విచారణ జరపాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ విజ్ఞప్తి చేశారు.

## జమ్మూలో ఎన్‌కౌంటర్..
### ముగ్గురు టెర్రరిస్టులు హతం

(మొదటిపేజీ తరువాయి)

జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే మృతిచెందిన ఉగ్రవాదుల నుండి ఏకే-47 రైఫిల్స్‌తో పాటు మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే దేశంలోకి ఉగ్రవాదుల ప్రవేశాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని అధికారులు అన్నారు. వేట కొనసాగుతుందని శాంతికి భంగం కలిగించే వారికి ఎట్టిపరిస్థితుల్లో భారత్‌లో ఆశ్రయం దొరకదని ఆర్మీ అధికారులు తెలిపారు. కాగా ఇటీవల జమ్మూకశ్మీర్ ప్రాంతంలో భద్రతా బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లో సరిహద్దులోకి ప్రవేశించకుండా ఆధునాతన డ్రోన్లు నిఘా కెమెరాలతో పహారా కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు ముష్కరులను భద్రతా బలగాలు కాల్చి చంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ జమ్మూ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు ఆరుగురు టెర్రరిస్టులు హతమైనట్లు అధికారులు తెలిపారు.

# రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలో దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఇంటెక్‌వెల్ వద్ద మోటార్లను సందర్శించిన ఆయన.. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పాయింట్ వద్ద ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రేవంత్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివామని చెబుతున్న జ్ఞానవంతులు ఆనాడు 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామన్నారు.

### భూసేకరణే అసలు సమస్య...

ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భూసేకరణే అసలు సమస్యగా మారిందని, ఫలితంగా ప్రాజెక్టుల అంచనాలు కూడా పెరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన వాళ్లు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేంది కాదన్నారు. ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని, దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు 2001లో రూ.6,000 కోట్ల అంచనాతో ప్రారంభమై ప్రస్తుతం రూ.18,500 కోట్లకు పెరిగిందని, ఆ మేరకు బడ్జెట్‌లోపే అన్ని అంచనాలను ప్రభుత్వం ముందు ఉంచి ఆమోదం



తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మార్చిలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంచనాలకు ఆమోదం తెలియజేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో దేవాదులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక నెలలోపు దేవాదుల పంపులను మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడుతూ అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, గత ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తాము సహకరిస్తున్నామనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం రాజీ పడదని చెప్పారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు విమర్శలు కాకుండా సూచనలు ఇస్తే స్వాగతిస్తామని పేర్కొన్నారు. 'అధికారం, పదవులు వారసత్వంగా రావు.. ప్రజలే నిర్ణయిస్తారు.. పదవులు ఎవరి సొత్తు కాదు.. ప్రజల ఆశీస్సులతోనే పదవులు వస్తాయి'అని రేవంత్‌రెడ్డి అన్నారు. 2034 వరకు మరో పదేళ్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఏదీ?

మొదటి పేజీ తరువాయి

ప్రకటన లేకపోవడం రైతుల్లో అసంతృప్తి పెంచుతోంది. రైతు భరోసా కింద ఎకరానికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. రెండు సీజన్‌లకు విడివిడిగా సాయం అందిస్తామని ప్రకటించింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరానికి మొత్తం రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. రెండు సీజన్‌లకు కాకుండా, ఒక్క సీజన్‌కు రూ.6 వేల చొప్పున మాత్రమే జమ అవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో మేనిఫెస్టోలో చెప్పిన హామీ అమలు కాలేదనే అభిప్రాయం గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తమవుతోంది. పెట్టుబడి సాయం అందించేందుకు అమలు చేస్తున్న రైతు భరోసా పథకం మరోసారి చర్చనీయాంశమైంది. 2025 వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,54,059 మంది రైతులకు రూ. 255.48 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో బ్యాంకు ఖాతాలు అనుసంధానం ఉన్న మొత్తం 2,14,929 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.240 కోట్లు జమ అయ్యాయి. అయితే అదేవిధంగా యాసంగి సీజన్‌కు కూడా సాయం అందుతుందని భావించిన రైతులకు నిరాశ ఎదురైంది. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమై పంటలు విత్తే సమయం దాటుతున్నా రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ కాలేదు. విత్తనాలు,




ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరిగిన ఈ సమయంలో ప్రభుత్వం ఉంచి రావాల్సిన సాయం ఆలస్యమవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పాత రుణాలు ఉన్న రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చేయడంలో వెనుకంజ వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతు భరోసా నిధులు ఆలస్యం రావడం మరింత ఆర్థిక ఒత్తిడిని తెచ్చిపెడుతోంది. కొంతమంది రైతులు అధిక వడ్డీతో ప్రైవేట్ అప్పులు తీసుకుని సాగు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.


## లొంగిపోయిన దేవ్‌జీ

(మొదటిపేజీ తరువాయి)

ఇక నెరవేరినట్లేనన్న చర్చ నడుస్తోంది. తిప్పిరి తిరుపతి స్వస్థలం జగిత్యాల జిల్లా కోరుట్ల కాగా, రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవారు.

### మా ప్రభుత్వానికి భారీ విజయం

'కేంద్ర హోంమంత్రి అమిత్ షా రణనీతి, ఛత్తీస్‌గఢ్ సీఎం అవలంబించిన విధానాల కారణంగా మావోయిస్టు పార్టీ మనుగడ అంతిమ దశకు చేరుకుంది. దేవ్‌జీ, సంగ్రామ్‌లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, అబూజ్‌మడ్ అడవుల్లో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు మా ప్రభుత్వానికి భారీ విజయం. కానీ వారిద్దరి కంటే మరో సీనియర్ నేత (ముప్పాళ్ల లక్ష్మణరావు) ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారనే అంశంపై మాకు స్పష్టత లేదు. అగ్ర నాయకత్వంలో మరో నేత (మిసిర్ బెస్రా) జార్ఖండ్‌లో ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు సాయుధ మావోయిస్టుల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కర్రెగుట్టల్లో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌తో మాకు సత్ఫలితాలు వస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన 89 ఐఈడీలను నిర్వీర్యం చేశాం. మారిన పరిస్థితులను గుర్తించి మిగిలిన వారు కూడా లొంగిపోతే మంచిది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం'అని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ చెప్పారు.




## సీఎం ప్రతి అడుగు వెనుక భూకబ్జాలే..

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారమే ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చి బడా కాంట్రాక్టర్లకు భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న గండిపేట మండలం హైదర్షాకోట్, బండ్లగూడ బాధితులను ఆదివారం కలిసి మాట్లాడారు. ఆయనతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి ఉన్నారు. మధుపార్క్ రిడ్జ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ.. మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని.. వారి పక్షాన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఆనాడు కేసీఆర్ మంచి నీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే, రేవంత్ బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధుపార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులు బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము మూసీ శుద్ధికి వ్యతిరేకం కాదని.. ప్రజల కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే మాట్లాడుతున్నామని చెప్పారు. 'చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రైతులకు రైతు బంధు అడిగితే డబ్బుల్లేవని సీఎం అనడం విడ్డూరంగా ఉంది. పైసలు లేకపోతే మెస్సీతో ఫుట్‌బాల్ మ్యాచ్, మిస్ వరల్డ్ పోటీలకు వందల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? బడా కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్లు బిల్లులు ఇచ్చారు. ఇప్పుడు ఎవరి జేబులు నింపడానికి మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు?' అని నిలదీశారు.

## ఆందోళన వద్దు.. అందరికి అక్రిడిటేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు.



వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడానినీ తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్లకు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ , ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెందరాదన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవరావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఆదివారం రోజు తంగడిపల్లి గ్రామ సర్పంచ్ పామేన రాములు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామ-రస్యానికి ప్రత్యేకీగా విందు నిలుస్తున్నది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తంగడ పల్లి గ్రామ మజీద్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉ ందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలోని కుల మతాలకు అతీతంగా గ్రామ పెద్దలు, ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల టీజీసెట్ పరీక్షకు 94.93 హాజరు

**హైదరాబాద్:** గురుకుల విద్యా సంస్థల్లో ఐదోతరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఆదివారం టీజీసెట్-- 2026 పరీక్ష జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 492 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. 94.93 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎస్సీ గురు కుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన ఫలితాలు ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



## మురళీకృష్ణుడి రూపంలో నారసింహుడి దర్శనం

**యాదగిరిగుట్ట:** శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు మురళీకృష్ణుడి అవతారంలో తీర్థజనులకు దర్శనమిచ్చారు. ఉదయం హవనం, పారాయణం నిర్వహించారు. కృష్ణావతారం గురించి ప్రధాన పూజారి భక్తులకు వివరించారు. గర్భాలయంలోని మూలవరులను కొలుస్తూ నిజాభిషేకం, అర్చన జరిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవానీ శంకర్ పాల్గొన్నారు.



## అన్ని జిల్లాల్లోనూ వ్యవసాయ ప్రదర్శనలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్:** వివిధ పంటల సాగు, విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలపై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వపరంగా వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. త్వరలోనే సిద్దిపేట జిల్లాలో భారీఎత్తున ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. పొలాల్లో క్షేత్రస్థాయి సందర్శనలు విస్తృతంగా జరుపుతామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో రైతుబడి వ్యవసాయ ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి, స్టాళ్ల యజమానులు, రైతులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. "డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే రైతులు అన్ని విధాలుగా లబ్ధి పొందుతారు. తెలంగాణలో కమతాలు చిన్నవిగా ఉన్నందున వాటికి అనుగుణంగా యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చి సబ్సిడీని అందిస్తాం. ఆయిల్‌పామ్ సాగు అన్నివిధాలా లాభదాయకం. ఈ మేరకు ప్రోత్సహిస్తున్నాం. అంతర పంటగాను దీన్ని సాగు చేయవచ్చు. అధిక వర్షాలు, కోతులు, ఇతర సమస్యలు ఉండవు" అని తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన వ్యవసాయ ప్రదర్శన ఆదివారం ముగిసింది. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ తదితరులు, పలువురు రైతులు, నగరవాసులు ప్రదర్శనను సందర్శించారు.




# డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తుంది

### మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

- డ్రగ్స్ వద్దు... పుస్తకాలే ముద్దు అంటూ పరుగులు పెట్టిన యువత
- శాంతివనం రన్నర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ అవగాహన రన్




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నారపల్లి నందనవనంలో శాంతివనం రన్నర్స్, మేడిపల్లి ఆధ్వర్యంలో యువతలో మత్తు పదార్థాలపై చైతన్యం కల్పించేందుకు నిర్వహించిన అవగాహన రన్ కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 16కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌లో వందలాది మంది యువత, విద్యార్థులు, మహిళలు, ఫిట్‌నెస్ అభిమానం కలిగిన వారు ఉ త్సాహంగా పాల్గొన్నారు. "డ్రగ్స్ వద్దు -- పుస్తకాలే ముద్దు" అనే నినాదాలతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ అనే సామాజిక వ్యాధి యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ప్రతి కుటుంబం ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న రన్నర్లకు మెడల్స్, సర్టిఫికేట్లు అందజేశారు. సీఐ మక్బూల్ జాని మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరమని, యువత దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి ఫౌండేషన్ తుంగతుర్తి రవి, వాకిటి శ్రీకాంత్ రెడ్డి నిర్వాహకులు సోమశేఖర్, శేఖర్ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.




## డ్రగ్స్ లేని సమాజం కోసం యువత కదలాలి

### పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనే లక్ష్యంతో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక పరుగు ఉత్సాహంగా సాగింది. శాంతివనం రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నారపల్లి వరంగల్ రహదారిలోని భాగ్యనగర్ నందనవనం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. డ్రగ్స్ రహిత సమాజం కోసం నిర్వహించిన ఈ పరుగును పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ మహమ్మారి య-ువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తోందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తుంగతుర్తి రవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. డ్రగ్స్ వద్దు - పుస్తకాలే ముద్దు అనే నినాదంతో సామాజిక చైతన్యం కల్పించడం అభినందనీయ మన్నారు. కేవలం శారీరక దృఢత్వం కోసమే కాకుండా, సమాజానికి మంచి సందేశం ఇవ్వడానికి వందలాది మంది ఈ పరుగులో పాల్గొనడం సంతోషకరమని కొనియాడారు. హైదరాబాద్ రన్నర్స్ సహకారంతో నిర్వహించిన ఈ పరుగులో 16 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల విభాగాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత ఐక్యంగా పోరాడాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమశేఖర్, శేఖర్, మక్బుల్ జానీ, శ్రీకాంత్ రెడ్డి, స్థానిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.






## మాదాపూర్‌లో మైండ్‌స్పేస్ ఈకో రన్ 2.0 సందడి

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా 5కె 10కె, 21కె పరుగు
- పలువురు సినీ ప్రముఖులు, ఉన్నతాధికారుల సందడి




**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** పర్యావరణ పరిరక్షణ, ఫిట్‌నెస్ ను ప్రోత్సహించే లక్ష్యంతో మాదాపూర్‌లో మైండ్‌స్పేస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈకో రన్ 2.0 విజయవంతంగా ముగిసింది. మైండ్‌స్పేస్, ఆర్ ఈ ఐ టి మిర్చి సంయుక్తంగా చేపట్టిన ఈవెంట్‌లో 5ఖ, 10ఖ, 21ఖ విభాగాలు ఉండటంతో అన్ని వయ-సుల వారు భాగస్వాములయ్యారు. మైండ్‌స్పేస్ ఆర్ ఈ ఐ టి ఎకోరన్ 2.0 యొక్క 5 కి.మీ పరుగును చిత్ర బృందంతో కలిసి దివి వద్య, శ్రీదేవి అపల్ల, హర్ష్ రోషన్, కోన వెంకట్ ప్రారంభించారు. మైండ్‌స్పేస్ ఎకోరన్ 2.0లో 21 కి.మీ పరుగును సి. శేఖర్ రెడ్డి ఐజిబిసి జాతీయ ఛైర్మన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, శ్రావణ్ కుమార్, కె. రహేజా కార్ప్ ప్రారంభించారు. ఈ పరుగులో సుమారు 4,200 మందికి పైగా నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెలబ్రిటీలు దివి వాధ్య, హర్ష్ రోషన్, శ్రీదేవి అప్పళ్ల ఈ రన్‌ను ప్రారంభించగా, మిర్చి ఆర్జేలు తమ సందడితో రన్నర్లలో జోష్ నింపారు. ఈ ఈవెంట్ ప్రధానంగా పర్యావరణ స్పృహను చాటిచెప్పింది. రన్నర్లకు అందజేసిన కిట్స్‌లో ప్లాంట్ చేయగలిగే బిబ్స్, ఆర్గానిక్ జెర్సీలు, బయోడిగ్రేడబుల్ కట్లరీని ఉపయోగించి ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించారు. ఈ ఈవెంట్‌లో మరో గొప్ప అంశం ఏమిటంటే, సేకరించిన వ్యర్థాలను అప్‌సైకిల్ చేసి కుర్చీలుగా తయారు చేసి, 'నిర్మాణ్' ఎన్జీఓ ద్వారా పేద విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కే రహేజా కార్ప్ సీఓఓ శ్రావణ్ కుమార్ గోనే మాట్లాడుతూ తమ అభివృద్ధి ప్రాజెక్టుల్లో సస్టైనబిలిటీని భాగం చేయడమే తమ ఆశయమన్నారు. మొత్తానికి ఈ పరుగు హైదరాబాద్‌లో పర్యావరణహిత జీవనశైలి, సామాజిక బాధ్యత పట్ల ప్రజల్లో అవగాహనను మరింత బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ఉద్యోగులు సెలబ్రిటీలు, స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధితో
# ఆర్థిక అభివృద్ధి సాధించాలి

### చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** యువత ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజు చేవెళ్ల మున్సిపల్ పరిధిలో క్యూ సెట్ ఇన్స్టిట్యూట్ ను ప్రారంభించిన చైర్పర్సన్ దేవర సమతారెడ్డి వెంకట్ రెడ్డి, వారితో పాటు శైలజ ఆగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఆలూరు గ్రామానికి చెందిన జె శ్రీధర్ ఏర్పాటు చేసిన "క్యూ సెట్ " కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ అకాడమీని 15వ వార్డు కౌన్సిలర్ శైలజా ఆగిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ఆగిరెడ్డి, ప్రొప్రైటర్ శ్రీధర్ లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత సమాజంలో డిజిటల్ యుగంలో కంప్యూటర్ వాడకం సర్వసాధారణం అయిపోయిందని, కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, విద్యార్థులు, నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణ విధిగా తీసుకోవాలని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి అన్నారు. వేసవి కాలంలో దాదాపు అన్ని పాఠశాలలు, కళాశాలలు హాలిడేస్ ప్రకటిస్తాయనే విషయం మనందరికీ తెలిసిందేనని, చేవెళ్ల పట్టణ కేంద్రంలో వ్యవసాయం మార్కెట్ ఎదురుగ చంద్రారెడ్డి నగర్ కాలనిలో ఏర్పాటు చేసిన ""క్యూ సెట్ ""ఇన్స్టిట్యూట్ లో విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, ఈ క్యూ సెట్ ఇన్స్టిట్యూట్లో చేరి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు, జే.శ్రీధర్, డైరెక్టర్లు జి శ్రీనివాస్, కె శేషుకుమార్ లు మాట్లాడుతూ.... చేవెళ్ల పట్టణంలోని క్యూ సెట్ కంప్యూటర్ అకాడమీలో అతి తక్కువ ఫీజుతో ఎం ఎస్ ఆఫీస్, డి. సి. ఏ.,సి. లాంగ్వేజ్, ఫోటో షాప్, టాలీ, డి. టి. పి. వంటి డిజిటల్ మార్కెటింగ్ కోర్సులను కూడా అందుబాటు లోకి తీసుకువచ్చామని నిర్వాహకులు శ్రీధర్ తెలిపారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతి, యువకులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రాంచ్ వచ్చేసి చేవెళ్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా చంద్రారెడ్డి నగర్ కాలనీలో ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9:00 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇన్స్టిట్యూట్ ఓపెన్ చేసి ఉంటుందని, కంప్యూటర్ శిక్షణనే కాకుండా కెరీర్ గైడెన్స్ కూడా అదనంగా అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంతో పాటు, పట్టణ ప్రాంత నిరుపేద విద్యార్థులు, యువతి, యువకులు, నిరుద్యోగులు కంప్యూటర్ పై నాలెడ్జ్ లేకపోవడం ఆలోచించదగ్గ విషయమని అన్నారు. మీ క్వాలిఫికేషన్ ను బట్టి కోర్సులను నిర్ణయించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, కోర్సును నేర్చుకునేందుకు కనీసం రెండు నెలల నుంచి, మూడు నెలల సమయం తప్పక పడుతుందని, శిక్షణ సమయంలో సమయపాలన పాటిస్తూ.. కంప్యూటర్ శిక్షణకు సహకరించడం ద్వారా నాణ్యమైన కంప్యూటర్ స్కిల్స్ నేర్పించేందుకు ఆస్కారం ఉంటుందని, క్యూ సెట్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు శ్రీధర్, శ్రీనివాస్, శేషుకుమార్, ఆలూరు మాజీ ఉపసర్పంచ్ కసిరి వెంకటేష్, తదితరులుపాల్గొన్నారు.



## జిల్లా అధ్యక్షులు ఐలేష్ యాదవ్ ఆధ్వర్యంలో
# జూబ్లీహిల్స్ ఎమ్ఎల్ఏతో భేటీ

### దౌల్తాబాద్ మల్లన్న జాతరకు ఆహ్వాన పత్రిక అందించిన సంఘం నేతలు.

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** తెలంగాణలో జాతరలు ఆధ్యాత్మిక వాతావరణానికి చిహ్నాలు గా ఉంటాయని అఖిలభారత యాదవ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఐలేష్ యాదవ్ అన్నారు. వచ్చేనెల మార్చి 9 వ తారీకు రోజున దౌలతాబాద్ లో మల్లన్న జాతరకు రావాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు ఆహ్వాన పత్రిక అందించారు. ఆదివారం రోజు ఐలేష్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నేతలు జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఇంటికి వెళ్లి మల్లన్న జాతర ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్బంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో అఖిలభారత యాదవ్ సంగం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెరుగు ఐలేష్ యాదవ్, రెడ్డి కానాపురం భాష యాదవ్, చంద్ర యాదవ్, శంకర్ ముదిరాజ్, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.



# శ్రీ కాలభైరవ స్వామి టెండర్ ప్రకటన

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఇసన్న పల్లి (రామారెడ్డి) గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఒక సంవత్సరం కొరకు తేదీ 1-3-2026 నుండి 28-2-2027 వరకు ఈ క్రింద తెలిపిన రాగిపాదుకములు, వెండి పాదకములు, చందనము, లామినేషన్, ఫోటోలు,స్టిక్కర్స్, కిరాణా సామాను, వంట చెరుకు కట్టెలు, ప్రింటింగ్ వస్తువుల కొరకు, భక్తుల నుండి గాని, వ్యాపారస్తుల నుండి గాని తేదీ 23-2-2026 రోజున మధ్యాహ్నం 2 గంటల వరకు షీల్డ్ కవర్లో ఆలయంలో సమర్పించవలెను, అదే రోజు 4 గంటలకు షీల్డ్ కవర్ను దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి రెనోవేషణ్ కమిటీ చైర్మన్, ధర్మకర్త మండలి సభ్యులు, ఇతర పెద్దల సమక్షంలో షీల్డ్ కవర్ను ఓపెన్ చేయబడును వ్యాపారస్తులు ఇట్టి విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు తెలిపారు.





# బోడుప్పల్‌లో వక్ఫ్ సెగ

## ప్రజల గోడు పట్టించుకోని ప్రభుత్వాలు

- రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై రోడ్డెక్కిన వేలాది కుటుంబాలు
- ప్రభుత్వం న్యాయం చేసేంత వరకు నిరసనలు తెలుపుతూనే ఉంటాం

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** మల్కాజ్గిరి నగరపాలక సంస్థ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పరిధిలో వక్ఫ్ భూముల పేరుతో సాగుతున్న రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై బాధితులు ఉగ్రరూపం దాల్చారు. తమ సొంత స్థలాలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల ఆర్ఎన్ఎస్ కాలనీ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున పలు కాలనీల ప్రజలు ర్యాలీగా బయలుదేరి నిరసనలు ప్రదర్శించారు. సుమారు పదివేల కుటుంబాలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. రిజిస్ట్రేషన్ల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో వివిధ కాలనీలకు చెందిన మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సంక్షేమ సంఘాల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గత పదేళ్లుగా సాగుతున్న ఈ అన్యాయంపై ప్రభుత్వానికి తమ గోడును విన్నవించుకుంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు.

**పదేళ్లుగా తప్పని పీడకలు:**

2015 సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపివేశారని, దీనివల్ల సుమారు పదివేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో కొనుగోలు చేసిన భూములను అమ్ముకోవడానికి గానీ, పిల్లల పెళ్లిళ్లకు లేదా అత్యవసర అవసరాలకు వాడుకోవడానికి వీలు లేకుండా పోయిందని వాపోయారు. అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని, తమ ఆస్తులపై తమకే హక్కు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాడు హామీ ఇచ్చి.. నేడు విస్మరించి:**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో తమ ప్రాంతాన్ని సందర్శించి, అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని బాధితులు గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక తమ సమస్యను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకులకు కూడా అనేకమార్లు విన్నవించినా ఎవరూ చొరవ చూపడం లేదని, రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను వక్ఫ్ బోర్డు బాధితులుగా మార్చిన ఈ నిబంధనలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమం ఉధృతం చేస్తాం:**

తమ నిరసన కేవలం ప్రారంభం మాత్రమేనని, ప్రభుత్వం స్పందించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వేలాది మంది ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ భూ సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ల పోరాట సమితి ప్రతినిధులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల బాధ్యులు, స్థానిక కాలనీల వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్వ భారతి లా కాలేజీలో
# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

- న్యాయవాదులు సేవాభావంతో పనిచేయాలి : ఓయూ లా డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వరులు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** నేటి ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లను, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక మార్పులను తట్టుకుని నిలబడేలా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఓయూ లా కాలేజ్ డీన్, హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరులు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని విశ్వ భారతి కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వరులు మాట్లాడుతూ.. న్యాయవాదులు క్లయింట్ల పట్ల గౌరవంతో మెలగాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. న్యాయ వృత్తిలో రాణించాలంటే నిరంతర అధ్యయనం అవసరమని, రోజుకు 18 గంటల పాటు కష్టపడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వృత్తిని కేవలం ధనార్జన కోసం కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సేవ చేయాలని ఆయన హితవు పలికారు. 2022--2025 విద్యా సంవత్సరంలో న్యాయవిద్య పూర్తి చేసిన 150 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో పట్టాలను అందజేశారు. ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కెరీర్‌ను అభివృద్ధి చేసుకుంటూనే సమాజానికి సేవ చేయాలని, తద్వారా విద్యాసంస్థల గౌరవాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "అనంత రాజమ్మ స్మారక అవార్డులను" అందజేశారు. శృతి మండా: గోల్డ్ మెడల్ (బంగారు పతకం). శైలజ కొండాపురం: సిల్వర్ మెడల్ (వెండి పతకం). కళాశాల కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని సమక్షంలో విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ వేడుకలో అధ్యాపకులు గురుమూర్తి, తేజశ్రీ, కీర్తి, రమ్యశ్రీతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.




# సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### చేవెళ్ల మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మున్సిపాలిటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నేడు చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ లో నిర్వహించనున్న సన్మాన కార్యక్రమ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల మున్సిపాలిటీ 14వ వార్డు సభ్యుల మద్దెల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సన్మాన సభ ఉంటుందని, ఈ సభలో చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారు శైలజాఆగిరెడ్డి, బక్క రెడ్డి మాధవి యాదిరెడ్డి, సోలిపురం సుచిత బల్వంత్ రెడ్డి, దావల్ గారి గోపాల్ రెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, మధుసూదన్ రెడ్డి, తాళ్లపల్లి నర్సింహులు, కృష్ణ నాయక్ లకు సన్మాన కార్యక్రమం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, కార్యకర్తలు నాయకులు, మున్సిపల్ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విద్యావంతం చేయాలని కోరారు.

## దామరదిద్ద వార్డులో
# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మున్సిపాలిటీ, మండల పరిధిలలో ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తుండడంతో వ్యాపారులు ఇష్టరాజ్యంగా తవ్వకాలు జరుపుతూ అక్రమ దంధ కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దామరగిద్ద రెవిన్యూ పరిధిలోని 153సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా జేసీబి సహాయంతో తీసిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దామరగిద్ద రెవిన్యూలో తవ్వ కాలు చేసి బస్తేపూర్ శివారులో కొత్తగా ఏర్పాటు చేసిన ఫామ్ ల్యాండ్ వెంచర్ కు మట్టిని తరలిస్తున్నారు. ఈ తతంగామంతా రాత్రి పూట, అధికారులు అందుబాటులోలేని శని, ఆదివారాలలో జోరుగా సాగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టరాజ్యంగ మట్టి తవ్వకాలతో ప్రభుత్వ ఆదయానికి గండి పడుతుందని, తవ్విన ప్రదేశాలలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానికుల నుంచి అధికారులకు పిర్యాదులు అందినప్పుడు నామమాత్రంగా తనిఖీ చేస్తున్నారని, పట్టబడ్డ ట్రాక్టర్లను రాజకీయ ఒత్తిడి కారణంగా వదిలేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దింతో ఇష్టరాజ్యంగా తవ్వకాలు జరుపుతూ, అడ్డు అదుపు లేకుండా దందా సాగిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని తనిఖీలు ముమ్మరం చేసి అక్రమంగా మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ పనులకు మట్టి కావాలంటేనే సంబంధిత అధికారుల అనుమతులు కావాల్సిఉంటుంది. అలాంటి రూల్స్ తమకేవి వర్తించవు అనే రీతిలో మట్టి మాఫియా కొనసాగుతుంది.

**అక్రమంగా తరలించే వారిపై చర్యలు తప్పవు**
**తహసీల్దార్ కృష్ణయ్య**

ప్రభుత్వ భూములలో అక్రమంగా మట్టిని, మోరంను తరలించ కుండా చర్యలు తీసుకుంటాము. అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

- సర్పంచ్ నందిపాటి మల్లిఖార్జున్
- బచ్చోడులో మంచినీటి బోరు,చేతి పంపుల మరమ్మతులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పంచాయితీ పాలకవర్గం సమన్వయంతో ముందుకెళ్తామని సర్పంచ్ తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు సర్పంచ్ నందిపాటి మల్లిఖార్జున్ తెలిపారు.రాబోయే వేసవికాలం దృష్ట్యా గ్రామంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయితీ కార్యదర్శి నిఖిల్ ముందు చూపుతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆదివారం చేతి పంపులకు,మంచినీటి బోరులకు మరమ్మతులు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి,మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు.ఇప్పటికే గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టామని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో,గ్రామ పెద్దలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామసహాయం అరవింద్ రెడ్డి ప్రోత్సాహంతో బచ్చోడు గ్రామాన్ని మండలంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# పరగడుపునే గోరు వెచ్చని నీటిని తాగుతున్నారా..?

## ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!

**నీరు మన శరీరానికి ఎంతో అవసరమన్న సంగతి మనందరికీ తెలిసిందే. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు, రక్తప్రసరణకు, జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, శరీర జీవక్రియలకు నీరు ఎంతో అవసరం. రోజూ 8 నుండి 9 గ్లాసుల నీటిని తప్పకుండా మనం తాగాల్సిందే. అలాగే రోజూ మనం నీటిని తాగుతున్నప్పటికీ ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. ఇలా గోరు వెచ్చని నీటిని ఉదయం పూట తాగడం అందరికీ అలవాటుగా మారుతుందని కూడా చెప్పవచ్చు. ఉదయం పూట నీటిని తాగడం వల్ల అజీర్తి సమస్య తగ్గుతుందని చాలా మంది భావిస్తుంటారు. అయితే ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల నిజంగానే అజీర్ణ సమస్య తగ్గుతుందా.. ఇలా నీటిని తీసుకోవడం వల్ల శరీరానికి మేలు కలుగుతుందా.. ఇది అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందా.. దీని గురించి వైద్యులు ఏమంటున్నారో.. తెలుసుకుందాం.**



ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణక్రియకు సహజ ఉద్దీపనగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల ఆహారం సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల పేగులకు రక్తప్రవాహం పెరుగుతుంది. జీర్ణక్రియ వేగంగా జరుగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. కనుక ఉదయం పూట గోరువెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అయితే మనం నీటిని తీసుకునే ఉష్ణోగ్రత, సమయం కూడా వీటిపై ఆధారపడి ఉంటాయని వారు చెబుతున్నారు. 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని పొట్ట చలనశీలత కోసం తీసుకోవడం మంచిది. 50 నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి లక్షణాలను తగ్గించడానికి తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కనుక ఉదయం తాగే నీరు 50 డిగ్రీల నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### కిడ్నీల ఆరోగ్యానికి..

ఇక ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనం తీసుకునే అల్పాహారం మరింత సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. ఆమ్లత్వం తగ్గుతుంది. ఖాళీ కడుపుతో నీటిని తాగడం వల్ల ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. దీంతో మలబద్దకం సమస్య తగ్గుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మూత్రపిండాలు వ్యర్థాలను సమర్థవంతంగా బయటకు పంపిస్తాయి. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అవయవాలకు ఆక్సిజన్ మరింత సమర్థవంతంగా అందుతుంది. వేడి నీటిని తాగడం వల్ల మనం సులభంగా బరువు కూడా తగ్గవచ్చు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. నిల్వ ఉన్న కొవ్వు వేగంగా కరుగుతుంది. క్యాలరీలు ఎక్కువగా ఖర్చు అవుతాయి. తద్వారా మనం వేగంగా బరువు తగ్గవచ్చు.

### బాగా వేడిగా ఉన్న నీటిని తాగితే..

ఉదయం పూట వేడి నీటిని తాగడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మనం తాగే నీరు 60 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి లేకుండా చూసుకోవాలి. ఎక్కువ వేడి ఉన్న నీటిని తాగడం వల్ల నాలుక సున్నితమైన పొర దెబ్బతింటుంది. దంతాలపైఉండే ఎనామిల్ కాలక్రమేణా బలహీనపడుతుంది. వేడి నీరు కొందరిలో యాసిడ్ రిఫ్లెక్స్ ను పెంచుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల గొంతు చికాకు, బొంగురు గొంతు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. ఖాళీ కడుపుతో తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తాగడం వల్ల రక్తంలో సోడియం స్థాయిలు పలుచగా అవుతాయి. దీంతో వికారం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఉదయం పూట గోరు వెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి, జీర్ణ వ్యవస్థకు మంచిదే అయినప్పటికీ నీటిని తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# కుచేలోపాఖ్యానం



అవనీపతి పరీక్షిత్తు తపోధన్యాగ్రణి శుకునితో.. 'మహామునీ! నళినీ (పద్మ) దళలోచనుని అనితర వీర్యగుణ సంపదలు అనంతాలు. వాని గురించి వేమారు- పలుమారులు ఎంతగా విని ఉన్నా స్వాంతా- చిత్తానికి తనవి తీరదు. ఎంతటి ఇంద్రియలోలుడైనా ఇందీవరుని అరవిందనేత్రుని- ముకుందుని దివ్య కథా వైభవాన్ని ఒక్కమారు విన్నా అతను తన ఐహిక సుఖాసక్తిని పోనిడి- మాని దేవదేవుని యందు భక్తి తత్పరతని పొంది తీరుతాడు. భగవత్కథ ఎంత విన్నా తృప్తి కలుగదు. ఇది భగవంతుని తోటి నిత్య వియోగం. కాని, కథ వింటుంటే ఎంతో ఆనందం, ఇది స్వామితోటి నిత్య సంయోగం. అదీగాక, పరమాత్ముని విషయంలో ప్రవర్తించే ఇంద్రియాలే సార్థకాలు. ఇతరాలు అనర్థకాలు- వ్యర్థాలు..

చ॥ 'హరి భజియించు హస్తములు హస్తము, లచ్యుతు గోరి మ్రొక్కు త
చ్ఛిరము శిరంబు, చక్రధరు జేరిన చిత్తము చిత్త, మిందిరా
వరుగను దృష్టి దృష్టి, మురవైరి నుతించిన వాణి వాణి, య
క్షరుకథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుబో భువిన్'

'మునీంద్రా! గజేంద్ర వరదుని- కృష్ణుని భజించే- సేవించే హస్తాలే హస్తాలు. భక్తితో భుజగేంద్ర శయనుని- అచ్యుతుని అంఘ్రి (పాద) పద్మాలకు ప్రణమిల్లే శిరసే శిరస్సు. ఆ మాధవుని యందు మగ్నమైన మనసే మనస్సు. మందరగిరి ధరుని, ఇందీవరశ్యాముని- గోవిందుని సుందర రూపాన్ని దర్శించే కన్నులే కన్నులు. ఆ కరుణాలవాలుని కీర్తించే నాలుకే నాలుక. మార జనకుని, వ్యాల- కాళియ మర్దనుని లీలలను పారవశ్యంతో ఆలకించే వీనులే- చెవులే వీనులు. కావున, మునివరా! ఆ పరమేశ్వరుని కనీవినీ ఎరుగని కరమరుదైన అశేష లీలా విశేషాలను గూర్చి ఇంకనూ నాకు వివరించు' అని కోరగా హరి పాదపద్మాసక్తుడైన బాదరాయణి- వేదవ్యాస తనయుడైన శుకయోగి ఇలా నివేదించాడు..

సీ॥ 'అనుడు వేదవ్యాస తనయుడా యభిమన్యు
తనయుని జూచి యిట్లనియె బ్రీతి
జనవర! గోవింద సఖుడు కుచేలుండు
నా నొప్పు విప్రుండు మానధనుడు
విజ్ఞాని రాగాదివిరహిత స్వాంతుండు
శాంతుండు ధర్మ వత్సలుడు ఘనుడు
విజితేంద్రియుడు బ్రహ్మవేత్త దారిద్ర్యంబు
బాధింప నొరుల గార్పణ్యవృత్తి
తే॥ నడుగ బోవక తనకు దానబ్బినట్టి
కాసు పదివేల నిష్కముల్‌గా దలంచి
యాత్మ మోదించి పుత్రదారాభిరక్ష
యొక విధంబున నడుపుచు నుండునంత'

నరేంద్రా! పూర్వం గోవింద సఖుడు- కృష్ణుని బాల్యమిత్రుడు- కుచేలుడు అనే భాసురుడైన- జ్ఞాన వైరాగ్యాలతో విరాజిల్లు, భూసురుడు ఉండేవాడు. అతడు మిక్కిలి స్వాభిమాని, గొప్ప విజ్ఞాని. రాగద్వేషాలు లేనివాడు. పరమశాంతికి ఖని- గని. (శాస్త్రాలన్నిటికి శమము- అంతరింద్రియ నిగ్రహమే చరమ ప్రయోజనం. కాన, ఎవని ఉల్లము- మనసు ఎల్లవేళలా ప్రసాద గుణ భూయిష్ఠంగా- చల్లగా, ప్రశాంతి నిలయంగా ఉంటుందో, వాడే సర్వశాస్త్ర పారంగతుడు'). అతడు ధర్మవత్సలుడు- చక్కని ధర్మనిరతి గల యతి సమానుడు, జితేంద్రియుడు. బ్రహ్మరతి గలవాడు- ఆత్మజ్ఞాని. అతి నిర్ధనుడు. అయినా ఎంతో ధృతి- ధైర్యం గలవాడు. సంగ్రహం- ధన సంచయం, ప్రతిగ్రహం- దాన స్వీకరణం చెయ్యక ప్రారబ్ధ ప్రాప్తంతో తృప్తి పడతాడు. దీనమతియై ఎవ్వరినీ ఏమీ యాచించడు.

అయాచితంగా ప్రాప్తించిన కాసు- కానినే పదివేల ధనరాశిగా తలుస్తూ, దానితోనే ఏదో విధంగా భార్యాపుత్రులను సాకుతూ వాసికెక్కినవాడు. (సఖుడు- 'సహ ఖ్యాయతే ఇతి సఖా' రామలక్ష్మణులు, కృష్ణార్జునుల వలె కృష్ణ కుచేలులు- సమానమైన ఖ్యాతి కలవారు). జితేంద్రియుడు- పంచ జ్ఞానేంద్రియాల అనుభవం పొందుతూ కూడా, ఎందునా- అనగా వింటూ, తాకుతూ, కంటూ, తింటూ, మూచూస్తూ- వాసన చూసియూ సంతోషం కాని, దుఃఖం కాని పొందనివాడు. పరధన విషయంలో ఎవడు అంధుడో, పరనారి విషయంలో ఎవడు నపుంసకుడో, పరవాద (పరనింద) విషయంలో ఎవడు మూగవాడో వాడే జితేంద్రియుడు. ధర్మవత్సలుడు- ధర్మం పట్ల విముఖుడు ఎంత బలవంతుడైనా సొంతం- పూర్తిగా దుర్బలుడే, ఎంత ధనవంతుడైనా ధనహీనుడే, ఎంత జ్ఞానవంతుడైనా అజ్ఞాని- మూర్ఖుడే. ఒక్కొక్కడు దరిద్రుడైనా దామోదరునికి దూరం కాడు.

నిజానికి అచ్యుతుడు అకించన- నిరుపేద ప్రియుడు. కుచేలుడు తపశ్శాలియైన దరిద్రుడు. ఆత్మజ్ఞాని నిర్ధనుడైనా సదా సంతృప్తుడై ఉంటాడు. ఎవరితోడూ లేకున్నా అతడు మహాబలవంతుడే. భుజింపకున్నా ఆత్మరసంచే నిత్యతృప్తుడుగానే ఉంటాడు. సర్వత్ర- అంతటా సమదృష్టితో ఉంటాడు కాన, ఆయనకు జోడు- సమానుడు ఎవ్వడూ ఉండడు (ఆదిశంకరులు). ఇలా 'జ్ఞానీ భక్తుడు' కనుకనే కుచేలుడు కృష్ణునికి అత్యంత ప్రియుడు. దారిద్ర్యానికి పరాకాష్ఠ యాచనే కాని నిర్ధనత్వం- బీదరికం కాదు. పరమేశ్వరుడు శంకరుడు కౌపీనధారి- గోచిపాతరాయుడైనా 'పరమేశ్వరుడు' అని లోకంలో ప్రసిద్ధమే కదా! ఇన్నీ మరిన్నీ విశేషాలను వివరించే పేరెన్నికగన్న గాథయే 'కుచేలోపాఖ్యానం'.

అసలు సిసలైన 'సఖ్యభక్తి'కి అపూర్వ ఉజ్జ్వల ఉదాహరణ. భాగవతం దశమ స్కంధంలో రెండు ప్రసంగాలలో అసంగుడైన శుకయోగికి 'భావ సమాధి' కలిగిందని ఆచార్యవాణి. మొదటిది గోవత్స అపహరణ లీల కాగా, రెండవది ఈ కుచేలోపాఖ్యానం. ఈ ఉపాఖ్యానంలో పోతన భగవత్ భాగవతుల మధ్య నెలకొన్న అవినాభావ, ప్రగాఢ, అనిర్వచనీయ, సమున్నత బంధాన్ని, సంబంధాన్ని, అనుబంధాన్ని రసభావ బంధురంగా అనుభవపూర్వకంగా రూఢిగా రూపించాడు.

'కుచేలుడు' అనేది గౌణనామం. చేలము అనగా వస్త్రం. కుచేలుడనగా జీర్ణమైన- చినిగిన, మలిన వస్త్రం ధరించిన వాడు. ఇది అక్షరార్థమే కాని పురాణ పరమార్థం మాత్రం ఇది కాదు. ఇక్కడ చేలం- వస్త్రమనగా అజ్ఞానమనే ఆవరణకు ప్రతీకం- సంకేతం. వస్త్రం దేహాన్ని ఆవరించునట్లు అజ్ఞానం జ్ఞానాన్ని- ఆత్మ స్వరూపాన్ని ఆవరిస్తుంది (మరుగు పరుస్తుంది)- 'అజ్ఞానేన ఆవృతం జ్ఞానం' అని కదా గీత. 'జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః'.. (గీత). బ్రహ్మజ్ఞానం అనే కత్తితో అజ్ఞానమనే వస్త్రాన్ని జీర్ణం శీర్ణం గావించిన- అనగా బొత్తిగా చించి పడేసినవాడు కుచేలుడు. కనుకనే బ్రహ్మ విద్వరుడు- బ్రహ్మవేత్తలలో ఉత్తముడు, శ్రేష్ఠుడు.

మరోవిధంగా.. 'వాసాంసి జీర్ణాని యథా విహాయ' (గీత)- విశీర్ణమయ్యే- కృశించి, నశించి పొయ్యే శరీరమే జీర్ణవస్త్రం. ఎంతగా పోషించి రక్షించినా ఏదో ఒకనాడు వల్లకాటికి ఆహుతి అయ్యేదే! దహింపబడేది కాన, దేహం. ఒడలు చినిగి- సడలి సన్నగిల్లి వెడలిపొయ్యేది కాన శరీరం. ఇదే కుచేలం. ఈ దృష్టితో లోకంలోని వారంతా కుచేలులే. కాని, ఈ సత్యం గ్రహించి నిత్యం తదనుగుణంగా వర్తించే- జీవించే వారెందరు? 'మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్' అన్నట్లు కుచేలుని వంటి మహాత్ముడు అత్యంత దుర్లభుడు.

సీ॥ 'లలిత పతివ్రతా తిలకంబు వంశాభి
జాత్య తద్భార్య దుస్సహదరిద్ర
పీడచే గడునొచ్చి పెదవులు దడుపుచు
శిశువులాకటి చిచ్చుచే గృశించి
మలమల మాడుచు మానసం బెరియంగ
బట్టె డోరెము మాకు బెట్టు మనుచు
బత్త్ర భాజనధృత పాణులై తను జేరి
వేడిన వీనుల సూడినట్ల'
తే॥ 'యైన నొకనాడు వగచి నిజాధినాథు
జేరి యిట్లని పలికె నో జీవితేశ
తట్టు ముట్టాడు నిట్టి పేదఱిక మిట్లు
నొంప దీని కుపాయ మూహింప వైతి'

శుకుడు- రాజా! కుచేలుని ధర్మపత్ని (వామాక్షి) మహా పతివ్రత. సద్వంశమున పుట్టినది. తిండిలేక కృశించిన పిల్లలు ఆకలి చిచ్చుకు తాళలేక, ఎండిన పెదవులను నాలుక- లాలాజలంతో తడుపుకొంటూ మలమల మాడుచున్న డొక్కలతో, చేతుల్లో ఆకులూ, గిన్నెలూ పట్టుకొని కన్నతల్లి వద్దకొచ్చి 'అమ్మా! ఆకలేస్తోందే! పట్టెడన్నం పెట్టవే' అని వేడికొనగా తట్టుకోలేక మిక్కిలి నొచ్చుకొని ఆ తల్లి తల్లడిల్లిపోయింది. భరించడం తనవల్ల కాక ఆ ఇల్లాలు ఒకనాడు భర్తతో.. నాథా! తట్టుముట్టాడు- మిక్కుటమైన పేదరికం ఇంట్లో విలయతాండవం చేస్తోంది. ఈ బాధనుంచి బయటపడే ఏదైనా ఉపాయం ఆలోచించండి' అని ఆవేదనతో పలికింది. ఆ ఇంతి- స్త్రీ తన కాంతునితో ఇంకా ఇలా అన్నది- మహాత్మా! అఖిల లోకారాధ్యుడు శ్రీకృష్ణుడు మీకు బాల్య సఖుడు గదా! ఆ మహానుభావుణ్ని ఒక్కసారి దర్శించండి. అతని అక్కటికం- దయ అనే సూర్య ప్రకాశం పొంది కటిక పేదరికమనే చిమ్మ చీకటిలో మగ్గుతున్న మమ్ము ఉద్ధరించండి.

చ॥ 'వరదుడు సాధు భక్తజన వత్సలు డార్తశరణ్యు డిందిరా
వరుడు దయోపయోధి భగవంతుడు కృష్ణుడు దా గుశస్థలీ
పురమున యాదవ ప్రకరముల్ భజయింపగ నున్నవాడు, నీ
వరిగిన నిన్ను జూచి విభుడప్పుడ యిచ్చు ననూన సంపదల్'

స్వామీ! అమర ప్రభువు మురహరుడు వరములనిచ్చు మేటి దేవర. భగవంతుడు భక్తవత్సలుడు. శ్రీపతి తన్ను ఆశ్రయించిన ఆర్తులను ఆదుకొనువాడు. వాసుదేవుడు దాసులపై ఆశించిన దాని కన్నా మిన్నగా దయ చూపువాడు. యాదవులు తన్ను సాదరంగా సేవిస్తుండగా ఆ మాధవుడు ప్రస్తుతం ద్వారకలో ఉన్నాడు. నాథా! ఆ జగన్నాథుని ఒక్కసారి చూచిరండి. ఆ కృపాసాగరుడు మిమ్ములను చూస్తే చాలు. వెంటనే మీకు అపార సంపదలు అనుగ్రహిస్తాడు.

మ॥ 'కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టి దు
ర్బలు డాపత్సమయంబునన్ నిజ పదా బ్జాతంబు లుల్లంబులో
దలపన్నంతన మెచ్చి యార్తి హరుడై తన్నైన నిచ్చున్, సుని
శ్చల భక్తిన్ భజియించువారి కిడడే సంపద్విశేషోన్నతుల్'

మున్ను ఎన్నడూ తన్ను- వెన్నుని, కలలో కూడా తలవని- స్మరించని బలహీనుడు పాపాత్ముడు కూడా ఆపన్నుడై- ఆపదలపాలై, ఖిన్నుడై (దుఃఖిస్తూ) ఆ సంకటస్థితిలో ఒక్కసారి ఆ భక్తజన మందారుని- కృష్ణుని పాదారవిందాలను మనసా తలచుకున్న చాలు, అట్టివానిని కూడా ఆ శ్రీహరి కనికరిస్తాడు. మెచ్చుకొని అతనికి తన్నుతానే అర్పించు- ఇచ్చుకుంటాడు. అంతటి ప్రసన్నాత్ముడు భక్తితో తన్ను సేవించేవారికి వెన్ను తట్టి మరీ క్రన్నన- శీఘ్రంగా సకల సంపదలు ఇయ్యకుండా ఉంటాడా?

రాజముద్ర

# వెల్లుల్లి టీతో రక్తపోటు నియంత్రణ

వెల్లుల్లిలో అనేక ఔషధ గుణాలు ఉ
ంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. దాదాపు అధిక శాతం మంది చేసే అన్ని రకాల వంటకాల్లోనూ దీనిని ఉపయోగిస్తూనే ఉంటారు. వెల్లుల్లి వంటలకు రుచిని పెంచడంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. వెల్లుల్లి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఇన్ఫెక్షన్ లు దరి చేరకుండా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. ముఖ్యంగా రక్తపోటును అదుపులో ఉంచడంలో వెల్లుల్లి ఎంతో ప్రయోజనకరంగా ఉ
ంటుంది.

## రక్తపోటు అదుపులో..

వెల్లుల్లిని నేరుగా తినలేరు. ఇది చాలా ఘాటుగా ఉంటుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు వెల్లుల్లితో టీ తయారు చేసి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారికి వెల్లుల్లి టీ ఏ విధంగా సహాయపడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. ధమనుల గోడలపై రక్తం బలం సాధారణం కంటే ఎక్కువగా ఉండే స్థితిని రక్తపోటు అంటారు. అధిక రక్తపోటును అదుపులో ఉంచడం చాలా అవసరం. దీనిని నియంత్రించకపోతే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. వెల్లుల్లిలోని సల్ఫర్ రక్తనాళాల్లో నైట్రిక్ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచించి రక్తపోటు తగ్గుతుంది. ధమనులు గట్టిపడడం, స్ట్రోక్ వంటి ప్రమాదాలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.

## ఎలా తయారు చేయాలంటే..

480 మిల్లీగ్రాముల నుండి 960 మిల్లీగ్రాముల మోతాదులో వెల్లుల్లిని తీసుకున్న వారిలో సిస్టోలిక్ రక్తపోటు గణనీయంగా తగ్గిందని నిపుణులు అధ్యయనాల ద్వారా వెల్లడించారు. ఈ విధంగా వెల్లుల్లి రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక వెల్లుల్లి టీని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం. దీని కోసం 3 వెల్లుల్లి రెబ్బలు, 3 కప్పుల నీరు తీసుకోవాలి. తరువాత ఒక గిన్నెలో నీరు పోసి అందులో వెల్లుల్లి రెబ్బలను దంచి వేసుకోవాలి. తరువాత ఈ నీటిని 4 నుండి 5 నిమిషాల పాటు మరిగించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. తరువాత వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేకాకుండా శరీర ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.




# కాకర ఆకులతోనూ అనేక లాభాలు

## తరచూ తీసుకోవడం మరిచిపోవద్దు..

చేదుగా ఉండే కాకరకాయలను కూడా మనం ఆహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటాం. ఇతర కూరగాయల లాగా కాకరకాయలు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే కేవలం కాకరకాయలే కాకుండా కాకరకాయ ఆకులు కూడా మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని మీకు తెలుసా.. కాకరకాయల లాగా కాకర ఆకులు కూడా అనేక పోషకాలను, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉ
ంటాయి. సాంప్రదాయ వైద్యంలో వీటిని అనేక సమస్యలకు నివారణగా ఉపయోగిస్తారు. కాకర ఆకుల్లో విటమిన్ ఎ, సి, ఫోలేట్, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహంతో బాధపడే వారికి ఇవి ఎంతో మేలు చేస్తాయి.

### జీర్ణ సమస్యలకు..

ఈ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో ఇవి మనకు ఎంతో సహాయపడతాయి. కాకర ఆకుల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరిగి ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటాం. ఈ ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని పెంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ ఆకుల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా బరువు తగ్గడంలో కూడా ఇవి మనకు దోహదపడతాయి. కాకర ఆకులు కాలేయ పనితీరుకు కూడా మద్దతును ఇస్తాయి. శరీరం నుండి వ్యర్థాలను తొలగించడంలో కాలేయానికి ఇవి మద్దతును ఇస్తాయి. తద్వారా శరీర మొత్తం ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో దోహదం చేస్తాయి.

### ఇలా తీసుకోవచ్చు..

ఇలా అనేక రకాలుగా కాకర ఆకులు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులతో నేరుగా జ్యూస్ చేసి అందులో నిమ్మరసం కలిపి తీసుకోవచ్చు. అలాగే అరటిపండ్లు, ఆపిల్ పండ్లు వంటి వాటితో కలిపి స్మూతీగా చేసి తీసుకోవచ్చు. కాకర ఆకులు మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ మధు-మేహం ఉన్న వారు వీటిని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఆకులను తీసుకునే ముందు చక్కెర స్థాయిలను పరీక్షించుకోవాలి. ఎందుకంటే కాకరఆకులు చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తాయి. ఇవి డయాబెటిస్ మందులతో కలిసినప్పుడు చక్కెర స్థాయిలు మరింత తగ్గి హైపోగ్లైసీమియాకు దారి తీసే అవకాశం ఉంది. కనుక వీటిని తీసుకునే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.






అజేయంగా లీగ్ స్టేజ్‌ను దాటి టీ20 ప్రపంచ కప్ సూపర్-8 పోరుకు వచ్చిన టీమ్ఇండియాకు పెద్ద షాక్ తగిలింది. దక్షిణాఫ్రికా చేతిలో ఘోర ఓటమిని చవిచూసింది. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో భారత్‌కిదే అతిపెద్ద పరాజయం. మరోవైపు ఈ పొట్టి కప్‌లో భారత సెమీస్ అవకాశాలు ఇబ్బందుల్లో పడ్డాయి. మిగిలిన రెండు మ్యాచుల్లోనూ అద్భుత విజయాలు సాధించాల్సిన పరిస్థితి.

# సూపర్-8లో టీమ్ఇండియా ఘోర పరాజయం

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 పోరులో టీమ్ఇండియాకు ఘోర ఓటమి ఎదురైంది. భారత్‌పై దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/7 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. శివమ్ దూబె (42) టాప్ స్కోరర్. భారత బ్యాటర్లలో దూబె మినహా ఎవరూ రాణించలేదు. ఇషాన్ కిషన్ (0), అభిషేక్ శర్మ (15), తిలక్ వర్మ (1), సూర్యకుమార్ యాదవ్ (18), హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0) విఫలమయ్యారు. మార్కో యాన్సన్ 4, కేశవ్ మహరాజ్ 3, కార్బిన్ బాష్ 2, ఐదెన్ మార్‌క్రమ్ ఒక వికెట్ తీశారు. టీమ్ఇండియా తదుపరి మ్యాచ్‌ను జింబాబ్వేతో ఫిబ్రవరి 26న ఆడనుంది.

### ఆ ముగ్గురు దూకుడు..

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. క్వింటన్ (6), ఐదెన్ మార్‌క్రమ్ (4), రియాన్ రికెల్టన్ (7) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరారు. జస్‌ప్రీత్ బుమ్రా (3/15), అర్ష్‌దీప్ (2/28) దెబ్బకు 20 పరుగులకే మూడు వికెట్లను కోల్పోయింది. అయితే, డెవాల్డ్ బ్రెవిస్ (45)తో కలిసి డేవిడ్ మిల్లర్ (63) దూకుడుగా ఆడేశాడు. వీరిద్దరూ 97 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో 26 బంతుల్లోనే మిల్లర్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మిల్లర్, బ్రెవిస్‌తోపాటు యాన్సన్ స్వల్ప వ్యవధిలో ఔటైనప్పటికీ.. ట్రిస్టన్ స్టబ్స్ (45లి) వీరవిహారం చేశాడు. ఆఖరి ఓవర్‌లో ఏకంగా 20 పరుగులు రాబట్టాడు. ఆ ఓవర్‌ను హార్దిక్ పాండ్య సంధించాడు.





## ఇక ఎదురీతే..

టీ20 ప్రపంచకప్ ఆరంభానికి రెండు నెలల ముందు భారత్‌లో టీ20 సిరీస్‌లో 1-3తో ఓడింది దక్షిణాఫ్రికా. ఇప్పుడు అదే జట్టు చేతిలో చిత్తు చిత్తుగా ఓడింది టీమ్ఇండియా. భారత జట్టు ఆను-పానులన్నీ తెలుసుకుని పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన సఫారీలు ఆదివారం మామూలు దెబ్బ తీయలేదు. ఇలాంటి కీలక మ్యాచ్‌లో 20/3కి చేరుకున్న జట్టు.. 187 పరుగులు చేయడం ఆషామాషీ విషయం కాదు. నిజానికి అహ్మదాబాద్ పిచ్ అంత తేలిగ్గా లేదని.. మ్యాచ్ ఆరంభమైన తీరు, తర్వాత భారత జట్టు బ్యాటింగ్ సాగిన వైనాన్ని బట్టి అర్థమవుతుంది. కానీ అద్భుత ఆరంభం తర్వాత భారత్‌ను ఒకింత ఉదాసీనత ఆవహించింది. వికెట్‌ను అనుసరించి బౌలింగ్ చేయకపోవడం, ఫీల్డింగ్ కూడా ఉత్తమంగా సాగకపోవడంతో ప్రత్యర్థి భారీ స్కోరు సాధించింది. ఒక ప్రణాళిక లేకుండా, పరిస్థితులకు అన్వయించుకోకుండా సాగిన బ్యాటింగ్ వల్ల భారత్‌కు ఘోర పరాభవం తప్పలేదు. ఆడితే బంతిని గాల్లో లేపడం, లేదంటే కుచించుకుపోవడం.. ఇదీ బ్యాటర్ల వరస. అంతే తప్ప స్ట్రైక్ రొటేట్ చేస్తూ సమయోచితంగా షాట్లు ఆడడంలో బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ ఓటమి భారత్ సామర్థ్యం మీద అనేక సందేహాలు రేకెత్తించింది. ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్టు గ్రూప్ దశలో నిష్క్రమించింది కదా, కప్పు గెలవడానికి మన అవకాశాలు మెరుగయ్యాయని అనుకుంటే.. ఇప్పుడు ఆతిథ్య జట్టు పరిస్థితే ఇబ్బందికరంగా మారింది. ఇకపై టోర్నీలో భారత్‌ది ఎదురీతే. దక్షిణాఫ్రికాపై మామూలుగా ఓడితే.. సెమీస్ చేరడానికి ఎక్కువ కష్టపడాల్సిన పని ఉండేది కాదు. కానీ ఏకంగా 76 పరుగుల తేడాతో చిత్తవడంతో నెట్‌రన్‌రేట్ బాగా దెబ్బ తినేసింది. టీమ్ఇండియా నెట్‌రన్‌రేట్ ప్రస్తుతం - 3.800. ఇక జింబాబ్వే, వెస్టిండీస్‌లపై ఘనంగా గెలవాల్సిందే. అదే సమయంలో దక్షిణాఫ్రికా మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం కూడా భారత్‌కు ఎంతో అవసరం. లేదంటే సొంతగడ్డపై ఆడుతూ, సెమీస్ కూడా చేరకుండానే డిఫెండింగ్ ఛాంపియన్ ఇంటిముఖం పట్టాల్సి రావొచ్చు.




## శ్రీలంక చిత్తు

### ఇంగ్లాండ్ ఘనవిజయం విజృంభించిన జాక్స్, ఆర్చర్

**పల్లెకెలె :** సొంతగడ్డపై శ్రీలంకకు గట్టి దెబ్బ. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన చేసిన ఆ జట్టు.. సూపర్ 8ను పేలవంగా ఆరంభించింది. సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 51 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ చేతిలో చిత్తుగా ఓడింది. దునిత్ వెల్లలాగె (3/26) సూపర్ బౌలింగ్‌తో మొదట ఇంగ్లాండ్ 9 వికెట్ల నష్టానికి 146 పరుగులే చేయగలిగింది. మదుశంక (2/25), తీక్షణ (2/21) కూడా విజృంభించడంతో ఆ జట్టు పరుగుల కోసం చెమటోడ్చింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ ఇన్నింగ్స్ ఊపందుకోలేదు. అయితే మిగతా బ్యాటర్లు విఫలమైనా.. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (62; 40 బంతుల్లో 6x4, 2x6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడి పోరాటమే ఇంగ్లాండ్‌కు గౌరవప్రదమైన స్కోరును అందించింది. ఛేదనలో శ్రీలంక ఘోరంగా విఫలమైంది. ఇంగ్లాండ్ పేస్, స్పిన్ బౌలింగ్‌కు దాసోహమన్న ఆ జట్టు.. 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. విల్ జాక్స్ (3/22), ఆర్చర్ (2/20), లయామ్ డాసన్ (2/27), అదిల్ రషీద్ (2/13) లంకను దెబ్బతీశారు. కెప్టెన్ శానక (30; 24 బంతుల్లో 1x4, 2x6) టాప్ స్కోరర్. ఆర్చర్, జాక్స్ ధాటికి విలవిల్లాడిన శ్రీలంక.. 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ పోటీలో లేదు. శానక ప్రయత్నించాడు. కానీ అది సరిపోలేదు. లంక ఇన్నింగ్స్‌లో కమిందు మెండిస్ (13) రెండో అత్యధిక స్కోరర్. విల్ జాక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. శ్రీలంక గ్రూప్-2లో ఆఖరి స్థానంలో ఉంది.

## ట్రోఫీతో.. సుందర్ పిచాయ్

అహ్మదాబాద్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య అహ్మదాబాద్‌లో టీ20 ప్రపంచకప్ సూపర్-8 మ్యాచ్‌కు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మ్యాచ్ ఆరంభానికి ముందు భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్‌తో పాటు పిచాయ్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. క్రికెట్ అంటే ఎంతో ఇష్టపడే ఆయన.. ఇండియా ఏఐ టూర్‌లో భాగంగా ఇటీవల గురుగ్రామ్ గూగుల్ ఆఫీస్‌లో భారత స్టార్ శుభ్‌మన్ గిల్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తాను పుల్ షాట్‌ను ఎలా ఆడతానో పిచాయ్‌కు శుభ్‌మన్ వివరించాడు.



అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# సమ్మర్ సీజన్ నభాకు అత్యంత కీలకం

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరోయిన్ నభా నటేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉంది. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత ఆశించిన స్థాయిలో హిట్లు అందుకోలేకపోయింది. 2024లో వచ్చిన 'డార్లింగ్' సినిమా కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. దానికి తోడు ఒక ప్రమాదానికి గురై, సుమారు ఏడాది పాటు సినిమాలకు దూరం కావాల్సి రావడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. అయితే, ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో, రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద యుద్ధానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం నభా నటేష్ చేతిలో రెండు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒకటి నిఖిల్ సిద్ధార్థ్ సరసన నటిస్తున్న చారిత్రాత్మక చిత్రం 'స్వయంభు', కాగా మరొకటి పీరియాడికల్ థ్రిల్లర్ 'నాగబంధం'. ఈ రెండు సినిమాలు కూడా పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నాయి. 'స్వయంభు'లో నభా ఒక విభిన్నమైన పాత్రలో కనిపించబోతోంది. ఇక 'నాగబంధం' కోసం ఆమె ఏకంగా యుద్ధ విద్యలు, కత్తి సాము వంటివి కూడా నేర్చుకోవడం విశేషం. ఈ సినిమాల కోసం ఆమె పడుతున్న కష్టం చూస్తుంటే, ఎలాగైనా సరే సక్సెస్ ట్రాక్ ఎక్కాలని గట్టిగా ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. సినిమాలు విడుదలకు ముందే నభా సోషల్ మీడియాలో సందడి మొదలుపెట్టేసింది. తన సినిమా పాత్రల గెటప్‌లలో ఫోటోషూట్లు చేస్తూ నెటిజన్లలో క్యూరియాసిటీని పెంచుతోంది. సమ్మర్ కానుకగా ఈ రెండు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకవేళ అమ్మడు అదృష్టం కలిసొచ్చి ఈ రెండు సినిమాల్లో ఏ ఒక్కటి క్లిక్ అయినా, నభా కెరీర్ మళ్ళీ స్పీడ్ అందుకోవడం ఖాయం. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న పోటీని తట్టుకుని, తన స్థానాన్ని పదిలం చేసుకోవాలంటే ఈ సమ్మర్ సీజన్ నభాకు అత్యంత కీలకం కానుంది.



# ఫ్లాప్స్ వచ్చినా క్రేజీ సినిమాల్లో ఛాన్సెస్

సినిమా ఇండస్ట్రీలో హీరోలతో పోలిస్తే హీరోయిన్ల కెరీర్ చాలా తక్కువగా ఉంటుంది. ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత హీరోయిన్లకు మంచి విజయాలు దక్కుతూ వెళితే చాలా సంవత్సరాల పాటు వారు మంచి దశలో కొనసాగుతారు. అదే వరుస పెట్టి అపజయాలను అందుకున్నట్లయితే చాలా తక్కువ టైంలోనే బ్యూటీలు కనుమరుగవుతారు. కానీ కొంతమందికి మాత్రం వరుస పెట్టి ఫ్లాప్స్ వచ్చిన క్రేజీ సినిమాలలో అవకాశాలను దక్కించుకుంటూ ముందుకు సాగుతుంటారు, అలాంటి వారిలో అను ఇమ్మాన్యుయేల్ ఒకరు. ఈ ముద్దుగుమ్మ ఇప్పటివరకు తెలుగులో చాలా సినిమాల్లో నటించింది. కానీ ఈమెకు ఒకే ఒక్క సినిమాతో మంచి విజయం దక్కింది. అయినా కూడా ఈ హీరోయిన్కి వరుస పెట్టి అవకాశాలు దక్కుతూనే ఉన్నాయి. అను ఇమ్మాన్యుయేల్ 2016లో విడుదల అయిన మజ్ను అనే మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి సక్సెస్ను, గుర్తింపును దక్కించుకుంది. ఆ తర్వాత ఈమె కిట్టు ఉన్నాడు జాగ్రత్త, ఆక్సిజన్, అజ్ఞాతవాసి, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, శైలజ రెడ్డి అల్లుడు, అల్లుడు అదుర్స్, మహాసముద్రం, ఊర్వశివో రాక్షసివో అనే తెలుగు సినిమాల్లో నటించింది.ఈ సినిమాల్లో చాలా వరకు మూవీలు బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. ఈ బ్యూటీ ఇప్పటివరకు తెలుగులో చాలా సినిమాల్లో నటిస్తే మజ్ను సినిమా ద్వారానే ఈమెకు మంచి విజయం దక్కింది. ఆ తర్వాత ఊర్వశివో రాక్షసివో కాస్త పర్వాలేదు అనే స్థాయి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ నటికి ఇన్ని ఫ్లాప్స్ వచ్చినా క్రేజీ సినిమాల్లో ఛాన్సెస్ దక్కుతున్నాయి.

# ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్

## ఉత్తమ నటుడు అల్లు అర్జున్..
## ఉత్తమ నటి నివేదా థామస్




కొచ్చి వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ఎంతోమంది ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. 'పుష్ప 2' సినిమాకిగానూ అల్లు అర్జున్ ఉత్తమ నటుడు అవార్డు, '35: చిన్నకథ కాదు' చిత్రానికిగానూ నివేదా థామస్ ఉత్తమ నటి అవార్డులు అందుకున్నారు. ఎక్కువ అవార్డులు 'పుష్ప 2' సినిమాకి వచ్చాయి. టాలీవుడ్‌కు దక్కిన మరికొన్ని అవార్డుల జాబితా ఇదీ (2024లో విడుదలైన సినిమాలకుగానూ)..

ఉత్తమ చిత్రం: పుష్ప 2
ఉత్తమ దర్శకుడు: సుకుమార్ (పుష్ప 2)
బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్: పుష్ప 2
ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ సహాయ నటి: అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటుడు: సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటి: నయన్ సారిక (గం గం గణేశా)
ఉత్తమ సాహిత్యం: చుట్టమల్లె చుట్టేస్తోంది (దేవర), రచయిత: రామజోగయ్యశాస్త్రి
ఉత్తమ గాయకుడు: శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి: గుంటూరు కారం)
ఉత్తమ గాయని: శిల్పారావు (చుట్టమల్లె)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ), రామకృష్ణ- మోనిక (పుష్ప 2)
బెస్ట్ కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్): లక్కీ భాస్కర్
ఉత్తమ నటుడు (క్రిటిక్స్): తేజ సజ్జా
ఉత్తమ నటి (క్రిటిక్స్): కాజల్ అగర్వాల్ (సత్యభామ)

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com